'ఆంధ్ర కళా దర్శని' పుస్తకంలో చోటు

వైవీయూ : 'ఆంధ్ర కళా దర్శని' అనే పేరుతో ఆర్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పుస్తక ప్రచురణలో యోగివేమన యూనివర్సిటీ లలిత కళల విభాగ అధ్యాపకులు భైరవ పోగు ఈరప్ప చిత్రాలు ప్రచురణ అయ్యాయి. 64 కళలు డాట్ కామ్ డైరెక్టర్ ఎల్లపు కళాసాగర్ నేతృత్వంలో సంకలనం చేసిన ఆర్ట్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ చిత్రకారుల డైరీ ఆవిష్కరణ జరిగింది. విజయవాడ వేదికగా ఆవిష్కరించిన ఆర్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 300 మంది చిత్ర, శిల్ప, హస్త కళాకారుల సమగ్ర వివరాలను పొందుపరిచారు. కర్నూలుకు చెందిన ఈరప్ప లలిత కళల విభాగ అధ్యాపకులుగా పని చేస్తున్నారు.

రక్తదాన ప్రచార సేవకుడికి సత్కారం


కడప ఎడ్యుకేషన్ : కడపలో మూడేళ్లుగా రక్తదానంపై అవగాహన కోసం కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేస్తున్న రాయల్ కరీముల్లా సేవలు అభినందనీయమని సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ అన్నారు. మంగళవారం మైనార్టీస్ డే సందర్భంగా జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఇమ్రాన్ ఆధ్వర్యంలో రక్తదాన ప్రచార సేవకుడు కరీముల్లాను సత్కరించారు. ఆల్ మైనారిటీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఫారుక్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఇలియాస్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం

కడప కల్చరల్ : యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆచార్యులు ఎస్.ఈశ్వర్‌రెడ్డి ఈనెల 16, 17 తేదీల్లో తమిళనాడులో జరగనున్న అంతర్జాతీయ సదస్సుకు హాజరు కావాలని నిర్వాహకులు ఆహ్వానం పంపారు. తమిళనాడులోని రాజభవన్‌లో దేశంలోని పలు ప్రముఖ సాహిత్య సంఘాలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నాయి. రెండు రోజుల ఈ విభిన్న భాషల సదస్సులో మహాకవుల గురించి ప్రముఖులు ప్రసంగించనున్నారు.

● ఆర్థో రోగుల కష్టాలు







రాయలసీమకు తలమానికమైన రిమ్స్ ఆస్పత్రికి జిల్లాతోపాటు ఇతర జిల్లాల నుంచి రోగులు వస్తుంటారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి హోదా రావడంతో వైద్య సేవలకు ప్రతి మంగళ, శుక్రవారాల్లో అంగవైకల్యంతో బాధపడుతున్న వారు వస్తున్నారు. రిమ్స్ ఆస్పత్రికి వస్తే ఉన్న జబ్బులు దేవుడెరుగు...కొత్త కష్టాలు తలెత్తుతున్నాయి. కీళ్లు, ఎముకల విభాగంలో స్ట్రెక్చర్లు, వీల్‌చైర్లు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వైద్యంపై నిర్లక్ష్యం వహించడంతో ఆస్పత్రిలో రోగుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

10వ జిల్లా మహాసభలు జయప్రదం చేయండి



మహాసభల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆర్ఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : వైఎస్సార్ జిల్లా బద్వేల్ పట్టణంలో ఈ నెల15, 16 తేదీలలో జరగనున్న ఆర్ఎస్‌యూ 10వ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ పేర్కొన్నారు. మంగళవారం కడప నగరంలోని విశ్వ ప్రగతి చిట్‌ఫండ్ కార్యాలయంలో జనసేన జిల్లా నాయకులు తుంగ రమణయ్యతో కలిసి గోడపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ చదువు, పోరాడు, సాధించు అనే నినాదంతో ఏర్పడిందన్నారు. మహాసభల సందర్భంగా గత విద్యా సంవత్సరం కాలంగా నిర్వహించిన పోరాటాలు సమీక్షించుకొని భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ జిల్లా నాయకులు కళ్యాణ్, వంశి పాల్గొన్నారు.

మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన నేతలు



మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన పాకా సురేష్, బాలస్వామిరెడ్డి

కడప కార్పొరేషన్ : తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కడప నగర వైఎస్సార్‌సీపీ నేతలు కలిశారు. కడప నియోజకవర్గంలోని పలు డివిజన్లలో ప్రజలు పడుతున్న సమస్యలను ఆయన దృష్టికి వారు తీసుకెళ్లారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అనేక సమస్యలు ప్రజలు ఎదుర్కొంటున్నట్లు వారు తెలియజేశారు. ముఖ్యంగా అక్కాయ్యపల్లి, చెమ్ముమియాపేట, రామరాజపల్లి, అలంఖాన్‌పల్లె, పాల్లెంపల్లె, దేవుని కడపలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కడప పార్టీ నేతలతో, జిల్లా అధ్యక్షుడితో సమన్వయం చేసుకుపోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పాకాసురేష్, బాలస్వామిరెడ్డి, రెడ్డి వరకుమార్, మధుసూదన్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఉప కార్మిక కమిషనర్ శ్రీకాంత్‌నాయక్ తెలిపారు. మంగళవారం కడ ప నగరంలోని కో ఆపరేటివ్ కాలనీ, నెహ్రూ పార్కు, అప్సరరోడ్డు, అన్నమయ్య సర్కిల్ ప్రాంతాల్లో వివిధ దుకాణాలను తనిఖీ చేసి బాల కార్మికులను గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలతో పనిచేయించడం చట్టరీత్యా నేరమన్నారు. చదువుకోవాల్సిన చిన్నారులను పనులకు పంపరాదన్నారు. ఈ విషయంగా తల్లిదండ్రులు చైతన్యవంతులు కావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్మిక అధికారులు శ్రీనివాసరెడ్డి, శైలజ, డీఎల్ఎస్ఏ, రీడ్స్ సంస్థ ప్రతినిధులు, ఎన్జీఓలు పాల్గొన్నారు.

శక్తి అభియాన్‌లో భాగస్వాములు కావాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : భారత యువజన కాంగ్రెస్ ప్రారంభించిన శక్తి అభియాన్‌లో మహిళలు భాగస్వాములు కావాలని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి, యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి మమతా నాగిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి తులసి రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఇందిరా భవన్‌లో యువజన కాంగ్రెస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాలు, నిర్ణయం తీసుకోవడంలో 'మహిళల ప్రయోజనాల' కోసం సమాన స్థలాన్ని సృష్టించడమే శక్తి అభియాన్ ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి సుమంత్ కుమార్, మాజీ పీసీసీ ఉపాధ్యక్షుడు బండి జకరయ్య, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అబుల్ కలామ్ ఆజాద్ జీవితం ఆదర్శనీయం



బహుమతులు ప్రదానం చేస్తున్న జిల్లా మైనార్టీ అధికారి షేక్ ఇమ్రాన్

కడప ఎడ్యుకేషన్ : మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జీవితం ఆదర్శనీయమని జిల్లా మైనార్టీ అధికారి షేక్ ఇమ్రాన్ పేర్కొన్నారు. ఆయనను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి ఉత్సవాలు – 2024 పురస్కరించుకుని మను పాలిటెక్నిక్ కళాశాలలో ఇటీవల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, ప్రసంగం తదితర పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపల్ మీర్జా విలాయత్ అలి బేగ్, కోఆర్డినేటర్ డాక్టర్ హకీముద్దీన్, కన్వీనర్ మొహమ్మద్ సికిందర్ హుస్సేన్, అధ్యాపకుల, విద్యార్థులు పాల్గొన్నారు.

తక్కువ విద్యుత్ ఖర్చుతో నడిచే గృహోపకరణాలు వాడాలి



విద్యుత్‌శాఖ ఎస్ఈ రమణ

కడప కార్పొరేషన్ : తక్కువ విద్యుత్‌తో నడిచే గృహోపకరణాలు వినియోగించాలని విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు రమణ, డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ కామేశ్వరరావు, ఈఈ ఎఫ్ఎల్ నోడల్ ఆఫీసర్ రమేష్‌బాబు తెలిపారు. మంగళవారం జిల్లాలోని రిజిష్టర్ ఎలక్ట్రిషియన్లతో విద్యుత్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. తక్కువ విద్యుత్ ఖర్చుతో అందించే విద్యుత్ ఉపకరణాల గురించి ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ఇలాంటి ఉపకరణాల వల్ల విద్యుత్ బిల్లులు తగ్గించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎలక్ట్రిషియన్లు పాల్గొన్నారు.

సెకండరీ గ్రేడ్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : డీఎస్సీ-2024లో భాగంగా సెకండరీ గ్రేడ్ టీచర్స్ పరీక్ష రాస్తున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ అధికారి కృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు తమ కుటుంబ వార్షికాదాయం రూ.లక్షల్లోపు కలిగిన వారు అర్హులని ఆయన పేర్కొన్నారు. ఉచిత శిక్షణకు టీటీసీ, టెట్ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులను టెట్ మెరిట్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారన్నారు. మొత్తం 200 మంది అభ్యర్థులను ఎంపిక చేస్తారని, శిక్షణా కాలం 60 రోజులు ఉంటుందని, ఎంపిక అయిన అభ్యర్థులకు స్టడీ మెటీరియల్‌కు రూ.1000, స్టయిఫండ్ నెలకు రూ.1500 అందిస్తారన్నారు. అర్హులైన అభ్యర్థులు బయోడేటాతోపాటు ఎస్ఎస్‌సీ, ఇంటర్, టీటీసీ మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాలు, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ పాసుపుస్తకం జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో పాత కలెక్టరేట్‌లోని ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌లో ఈ నెల 15వ తేదీలోగా సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు 97031 85382, 98499 19221 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని వివరించారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన బడ్జెట్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజాసంక్షేమాన్ని విస్మరించిందని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు సయ్యద్ గౌస్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధినిచ్చే ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడం దారుణం అన్నారు.

గాయపడిన యువకుడి మృతి

కడప అర్బన్ : కడప నగరం చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 10న ఆటోనగర్‌కు చెందిన సాధిక్‌వలి(22) అనే యువకుడు తన మోటార్‌సైకిల్‌పై వైఎస్ఆర్ నగర్ నుంచి ఇంటికి వెళుతుండగా అదుపుతప్పి కింద పడటంతో తీవ్రగాయాల పాలయ్యాడు. వెంటనే అతన్ని కర్నూలుకు తీసుకుని వెళ్లారు. అక్కడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు చిన్నచౌక్ ఎస్ఐ ఎన్.రాజరాజేశ్వర్‌రెడ్డి తెలియజేశారు.

ఆసుపత్రుల తనిఖీ



పట్టణ ఆరోగ్య కేంద్రంపై వివరాలు సేకరిస్తున్న జెడ్ఎంఓ డాక్టర్ లక్ష్మానాయక్

కడప రూరల్ : కడప నగరంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాలను జోనల్ మలేరియా నివారణ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మనాయక్ మంగళవారం తనిఖీ చేశారు. పకీరుపల్లె, ఎర్రముక్కపల్లె పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. ల్యాబ్‌లోని రికార్డులను పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎన్ఎంలు ఆశాలు క్షేత్ర స్థాయికి వెళ్లినప్పుడు టార్చ్‌లైట్ ద్వారా లార్వాలను పరిశీలించాలని సూచించారు. డేటా ఎంట్రీ ఆపరేటర్స్ ప్రతి కేసుని ఆన్‌లైన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హైమావతి, నాగలక్ష్మిరెడ్డి, నిత్య పూజయ్య తదితరులు పాల్గొన్నారు.

రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులతో రెజ్లింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

కడప స్పోర్ట్స్ : కడప నగరానికి చెందిన రెజ్లింగ్ క్రీడాకారులు రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో సత్తా చాటినట్లు జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.సాయికిశోర్ తెలిపారు. ఈనెల 9, 10 తేదీల్లో అనంతపురం జిల్లా కల్యాణదుర్గంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కడప నగరానికి చెందిన సి.రేణుకరెడ్డి 59 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించింది. 72 కేజీల విభాగంలో సి.కీర్తన వెండిపతకం, 92 కేజీల విభాగంలో భాస్కర్‌రెడ్డి వెండిపతకం సాధించారు. 86 కేజీల విభాగంలో ఎన్. కాశికేశ్వర్‌రెడ్డి కాంస్య పతకం, 130 కేజీల విభాగంలో జె.వెంకట నవీన్ కాంస్యపతకం సాధించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.సాయికిశోర్, కార్యదర్శి షేక్షావలి, జాయింట్ సెక్రటరీ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు వినతి

వైవీయూ : కడప నగరంలోని పాతబైపాస్ నుంచి మాచుపల్లిరోడ్డుకు నూతనంగా వేసిన తారు రోడ్డులో స్పీడ్‌బ్రేకర్లను ఏర్పాటు చేయాలని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు కోరారు. మంగళవారం విద్యార్థులు కడప నగర పాలక కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నూతన రహదారిపై ఆకతాయిలు ద్విచక్ర వాహనాల్లో వేగంగా వెళుతూ విన్యాసాలు చేస్తున్నారని విన్నవించారు. కావున స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంతోపాటు స్కూల్ జోన్ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు.

ఉక్కు పరిశ్రమకు నిధులు ఇవ్వకపోవడం దారుణం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో యువతకు ఉపాధి పరిశ్రమ అయిన కడప ఉక్కుకు నిధులు కేటాయించకపోవడం దారుణమని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ అన్నారు. మంగళవారం నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ యువతకు ఆశాజనకంగా లేదన్నారు. ముఖ్యంగా ఉపాధి పరిశ్రమల స్థాపన ప్రస్తావనే లేదని అన్నారు. సమావేశంలో నగర కన్వీనర్ విజయ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రంథాలయ స్వర్ణోత్సవాలు

కడప కల్చరల్ : జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆధ్వర్యంలో గురువారం నుంచి వారం రోజులపాటు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నామని సంస్థ కార్యదర్శి ఎస్.అమీరుద్దీన్ తెలిపారు. సంస్థ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులకు ఈ వివరాలు తెలిపారు. కడప నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం ఉదయం డీఈఓ యు.మీనాక్షి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి కార్యక్రమాలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ప్రముఖులు జవహర్‌లాల్ నెహ్రూ, గ్రంథాలయ ఉద్యమకారులు అయ్యంకి వెంకటరమణ, గాడిచర్ల హరిసర్వోత్తమరావు చిత్రపటాలకు పూలమాల అలంకరిస్తారన్నారు. పాఠశాల విద్యార్థులకు జాతీయ నాయకుల వేషధారణ పోటీలు నిర్వహిస్తామన్నారు. పాఠశాల, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు పాటల పోటీలు, వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. 15న పుస్తక ప్రదర్శన ఉంటుందన్నారు. 16వ తేదీనన 9, 10 తరగతుల విద్యార్థులకు చెస్‌పోటీలు, 7 నుంచి 10 తరగతుల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. గ్రంథాలయ ఉద్యమ నాయకులపై ప్రముఖుల ప్రసంగాలు ఉంటాయన్నారు. 17న బహుభాషా కవి సమ్మేళనం నిర్వహిస్తారు. 18న పాఠశాల, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు వ్యక్తత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తామన్నారు. 19న ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత, మహిళలపై అఘాయిత్యాలు అంశంపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేముల సలీం బాష అధ్యక్షత సభ నిర్వహిస్తామన్నారు. 20న సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో కార్యక్రమాల ముగింపు సభ ఉంటుందని వివరించారు.

దుర్గమ్మ సన్నిధిలో దోష నివారణ పూజలు



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు ఈ సందర్భంగా అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

15న పౌర్ణమి పూజలు

ఈనెల 15న కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో తెల్లవారుజామున 5 గంటల నుంచి అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 10 గంటలకు యాగ మండపంలో చండీహోమం నిర్వహిస్తారు. 10.30 గంటలకు సహస్ర లింగార్చన, సుమంగళి పూజ ఉంటుందన్నారు. రాత్రి 7 గంటలకు 108 మంది ముత్తయిదువులచే 108 దీపాలను వెలిగించి అమ్మవారికి అష్టోత్తర దీపాలంకార పూజ నిర్వహిస్తామన్నారు.

దేశానికి బాలలే భవిష్య సంపద



మాట్లాడుతున్న ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి

కడప కల్చరల్ : దేశానికి బాలలే భవిష్య సంపద అని యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి అన్నారు. భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) ఆధ్వర్యంలో మంగళవారం కడప నగరం పాలకొండల సమీపంలో గల నగరవనంలో వన మహోత్సవం నిర్వహించారు. నగరానికి చెందిన పలు పాఠశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు ఆచార్య ఈశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇంటాక్ జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ నెహ్రూ చూపిన బాటలో ఆదర్శవంతమైన జీవితాన్ని గడపాలని సూచించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య పూర్వ అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి, డాక్టర్ రంగనాథరెడ్డి మాట్లాడుతూ సామాజిక బాధ్యతను నెరవేర్చడంలో భాగంగా ఇంటాక్ బాలల సర్వతోముఖాభివృద్ధి కోసం ఈ వన భోజనాన్ని ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, రాయలసీమ టూరిజం సంస్థ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి, నగర వనం అటవీ అధికారిణి మల్లిక, ఇంటాక్‌సభ్యులు నాగవేణి, గౌరీశంకర్, బాల యల్లారెడ్డి, వెల్లాల వెంకటేశ్వరాచారి, లయన్ సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పురపాలక ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి



పాఠశాల విద్య ఆర్‌జేడీ శ్యాముల్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : నగరపాలక, పురపాలక ఉపాధ్యాయులకు ఆర్థిక నష్టం కలగకుండా వెంటనే పదోన్నతులు కల్పించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాషా, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సురేష్ బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంభం బాలంగారెడ్డి, రాష్ట్ర మున్సిపల్ కన్వీనర్ రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం వారు పాఠశాల విద్య ఆర్‌జేడీ శ్యాముల్‌ను తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర పాఠశాల విద్య శాఖ పురపాలక ఉపాధ్యాయులకు పదోన్నతులకు సంబంధించి నవంబర్ 6న ప్రధానోపాధ్యాయులకు, 8న స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించాలని షెడ్యూల్ విడుదల చేసిందన్నారు. కానీ ఆ షెడ్యూలు నేటికీ పూర్తి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నగరపాలక, పురపాలక పాఠశాలల్లో పని చేసే ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, ఎల్ఎఫ్ఎల్ హెడ్మాస్టర్ల పోస్టులకు పదోన్నతులు చేపట్టక చాలా కాలం అయిందన్నారు. ఇప్పటికైనా షెడ్యూల్ ప్రకారం పదోన్నతులు కల్పించి వారికి ఆర్థిక నష్టం లేకుండా చూడాలని కోరారు. ఈ విషయమై ఆర్జేడీ స్పందిస్తూ ప్రమోషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయడానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పద్మాకర్, జబివుల్లా పాల్గొన్నారు.

సరైన జీవనశైలితో మధుమేహం దూరం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు, అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్ : సరైన జీవనశైలి, సంప్రదాయ ఆహార నియమాలతో మధుమేహం రాకుండా కాపాడుకోవచ్చని జేవీవీ గౌరవాధ్యక్షుడు, డాక్టర్ ఎంఎల్ఎన్ ప్రసాద్ రాజు అన్నారు. నవంబర్ 14న వరల్డ్ డయాబెటిక్ వీక్‌ను పురస్కరించుకుని మంగళవారం కడపలోని ఎస్కేఆర్ అండ్ ఎస్కేఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో జనవిజ్ఞాన వేదిక జంతుశాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఆధ్వర్యంలో మధుమేహంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైన్సు ఉపాధ్యాయుడు శ్రీనివాసులరెడ్డి మధుమేహం వ్యాధిపై రూపొందించిన ఛాయా చిత్రం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సలీం బాషా, జంతుశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ పి.శచీదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ జి.విజయలక్ష్మిదేవి, వాహిదా, అధ్యాపకులు డాక్టర్ రిజ్వానా, డాక్టర్ జి మీనాకుమారి, నాగమునిరెడ్డి, నాగరత్నమ్మ, అనురాధ, జనవిజ్ఞాన వేదిక నగర కమిటీ అధ్యక్షుడు శివరాం, జిల్లా సమతా విభాగ కన్వీనర్ సునీత పాల్గొన్నారు.